Saraswata Niketanam,
VETAPALEM.



—'చలం'

సుందరమ్మ వంశం చాలా పూర్వాచారపారాయణ భూయిష్టం. లోకమంతా యేవిషయాలు వుత్త మూఢనమ్మకాలంటామో, వాటిల్లో వాళ్లకి అమితమైన విశ్వాసం. వారానికి ఒకసారన్నా వాళ్లింటో యెవరికో వొకరికి ఒక్క దెయ్యమన్నా కనపడి తీరుతుంది. అందులో ఆ దెయ్యాలన్నీ దుష్టమైనవి. పూర్వాన్నించీ కూడా ఆ వంశానికి భయంకర శాప మున్నదనీ, మొగవాళ్లు చావడమూ, ఆడవాళ్లు వితంతువులు కావడమూ, నిశ్చయమనీ, వాళ్లకి గట్టినమ్మకం. ఆపత్తులు వాళ్లకి మామూలై పోయినాయి.

ఆ వంశంలో చచ్చినవాళ్ల కెవరికీ ఊర్ధ్వలోక నివాసంగాని, పునర్జన్మలుగాని వున్నట్టు లేవు. అందరు ఆయింటి చుట్టుపక్కలే, చూర్లనూ, చెట్లనూ, పట్టుకు గబ్బిలాలవలె వేళ్లాడతో, వొంతులప్రకారం, జ్యోతిషాల లోనూ, సోదెలలోనూ, పూనడాలలోనూ, తమ సంతతి వారితో సంభాషిస్తో, తమకోర్కెలు తెలుపుకుంటో, తమ కోపాలకీ, శాపాలకీ, కారణాలు, వివరించుకుంటో వుంటారు.

"ఏడేళ్ల తొమ్మిది నెలల మూడురోజుల వెనక మీరు అట్లు వొండుకుని, నాకు అట్లు యిష్టమని తెలిసివుండి కూడా, నాకు పెట్టక, అన్నీ మీరేతిన్నారు. అందువల్ల నాకు కోపంకలిగి, నీ మునిమనమడు నాలుగేళ్లప్పుడే అట్లు తిని చావాలని శాపం పెట్టాను," అంటుంది ఒక చచ్చిన ముత్తవ.

"నువ్వు చుక్కల చీరెలు నాలుగు కొనుక్కునికూడా, ఒక్కటన్నా నాపేర ముత్తైదుకి పెట్టుకున్నావు కావు. కనక నీకూతురికి చీరెకట్టే యోగ్యతలేకండా చేశాను," అంటుంది ఒక మేనత్త.

ఈ శాపాలకి శాంతులు చెయ్యడంతో సరిపోతుంది బతికి వున్నవాళ్ల ధనమూ, శక్తీ, కాలమూ.

మొత్తానికి ఆయింటో వాళ్లు బతికివున్న మనషులతో కన్న, చచ్చిన వాళ్లతో యెక్కువకాలం గడుపుతారు. ఎవరు యింటికి వొచ్చినా, మూలుగులూ, ఏడుపులూ, భయాలూ, వ్యసనాలూ, తప్ప యింకేమీ కనపడక పోవడంచేత, బంధువులకు వాళ్ల యింటివొచ్చి వుండడం దుస్సహం.

కాని ఆగృహము పావనమైనది. సమస్తకాలమూ వేదాధ్యయనమూ, పురాణపఠణమూ, మంత్రజపమూ, యాగమూ; పూజా, వీటిలోనే నిమగ్నులై వుండేవారు స్త్రీ పురుషులు. ప్రయాణమూ, వార్తాపత్రికలూ, కలహమూ, సంస్కారమూ, ఇవి ఎన్నడూ ఆప్రైపులకు రావు. నీచభావాలూ, భౌతికకాంక్షలూ, యీర్ష్యా, అపేక్షా,

వీటి నెరగనే యెరగరు. దేహాలూ, గదులూ, భోజనమూ, శుచీ, మనసూ, ఆలోచనలూ, వ్రున్నతాలుగా వుంచుకోడం అలవాటై పోయింది. ఆయింటి చుట్టూగాని, వాళ్ల ప్రాతలలోని జలమే, ఒక విధమైన నిర్మలమైన పరిమళాన్ని కలిగివుండేది.

ఆవంశం వాళ్లందరూ గర్విష్టులు అధికారవంతులు. ప్రపంచం సంబంధం పెట్టుకోరు. కాని పొలముకాపులు కరణాలు, పండితులు, అందర్నీ అధికారవంతంగా, నిర్లక్ష్యంగా, తక్కువగా చూసి మాట్లాడడం అలవాటయింది. ఆవూరివారు యిచ్చిన గౌరవమే అట్లామార్చింది వాళ్లని. ఇతరులతో పనిపెట్టుకోరు, యాచించరు—తమ సౌఖ్యాలను ధనాన్ని, పొలాలను వొదులుకున్నారు గాని, లౌకికాధికారుల్ని ఒక్కర్ని యాచించిచలేదు.

తరతారాలనించి శిష్టాచారపరులై, నియమాలు తప్పని నిర్మలమైన అభ్యాసాలు కలిగి, భక్తిలో, భయంలో పితృదేవతల్నీ, ఉచ్ఛదేవతల్నీ పూజించే వైదికసాంప్రదాయం కలిగిన వృత్తిను బ్రాహ్మణ వంశంలో పుట్టడం చాత, ఆవంశం వారందరూ ధ్యానించే దేవతల సౌందర్యమంతా సుందరమ్మలో మూర్తీభవించిందా అని తోస్తుంది. ఆమె అందమంతా కదలని, నవ్వని, నిబ్బరిస్తుశాంత విగ్రహపు సౌందర్యం లాగుసు వుంటుంది. మాటలూ, నవ్వులూ, గంతులూ, లేక, నెమ్మదిగా చందమామవలె, చల్లగా ఆ చీకటియింట్లో, శబ్దంలేకండా, తిరుగుతో వుంటుంది. పుట్టినప్పటి నించీకూడా, ఆమె కళ్లలో అపారమైన ఖేదంతోస్తుంది. కళ్లుగోలగా శాస్త్రాలలో వర్ణించినట్టు, నల్లని కనిబొమ్మలకింద, పరుచుకుని, కణతల మీదపడే జుట్టుని తాకుతో వుంటాయి. కనుపాపలు-తెల్లని మబ్బుకింద సగం మాయమయే చంద్రుడివలె దిగులు కొల్పుతో పైరెప్పలకింద సగం అణిగి వుంటాయి. పసితనంలో కూడా ఆమె యెక్కువ విలాసాలు చూపక పోయినా, ఆమెని చూడడమే ఆనందం, ఆమె నడకలే నవ్వులు, ఆమె ముఖకాంతులే ముచ్చట్లు.

పెళ్లి ఐన దాకా కూడా సుందరమ్మ తనయిల్లు తప్ప ప్రపంచ మెరగదు. శాస్త్రాలు, వేదాంతాలు, పురాణాలు తప్ప వేరే విజ్ఞానము ఆమె మనసులో లేదు. పూజలతో, కర్మకలాపాలతో మునిగిన ఆ పల్లెటూరు కుటుంబంలో, కాలమాగి పోయింది. దేశమంతా కాలచక్రానికీ, కర్మానుభవానికీ లోబడి తిరిగిపోయి, మారిపోతూ వుంటే, ధ్రువనక్షత్రం లాగు ఆవంశం పురాతనత్వంలో, అట్లానే నిలిచిపోయింది. మోటార్లు, వితంతు వివాహాలు, లెజిస్లేటివ్ కౌన్సిళ్లు, సగంపరకు మీసాలు, ఆంగ్రోజ్యమాలు, వీటి మోత దూరంనించి, ఎదో పాతాళలోకం నించి కొంచెం కొంచెం వినపడతో వుంటుంది, ఆయింట్లో వాళ్లకి.

సుందరమ్మ ముఖ్యమైన సుగుణమూ, ఆమె లోపమూ కూడా భూతదయ. తాను యెంత స్వంత విచారాన్నైనా భరించగలదు. కాని ఎవరిలోనైనా, చివరికి చీమనీళ్లలో పడినా, తాను సహాయం చెయ్యకండా వుండలేదు. సహజమైన యీ దయవల్ల ఆమె అనాచారాలకి దిగి, తన బంధువులకి చాలా విషాదం కలిగించిన సమయాలు అనేక మున్నాయి.

ఎనిమిదో యేటనే మేనత్త కొడుకుకి సుందరమ్మని పెళ్లి చేశారు. పెళ్లికాగానే అతను మైసూరుకి సంస్కృత విద్యాభ్యాసానికై వెళ్లి ఆరేళ్లు అక్కడే గడిపి వొచ్చినందువల్ల సుందరమ్మ అతన్ని చూడనేలేదు. అతను మైసూరునించి సంసారి మామగారి యింటికివొచ్చి, కార్యము చేసుకుని, భార్యని తనతో తీసుకునివెళ్లాడు. సుందరమ్మ భర్త, పండితుడు, సౌమ్యుడు, రసికుడు, శృంగార కావ్యాలులోని వర్ణనలు పఠించినప్పుడల్లా, వాటి అన్వయంకన్న, వ్యాకరణంకన్న వాటి సౌందర్యం మీదనే దృష్టినివుంచి పుట్టింట్లో పెరుగుతున్న భార్యని తలుచుకునేవాడు. లోకాన్ని చూసినవాడు, కాని తన శాస్త్రములో విశ్వాసం చెడనివాడు. సుందరమ్మని చూడగానే అతనికి ఏకాగ్రత యేర్పడ్డది. వాళ్లవూళ్లో మూలనున్న యింటిని డాబాగా మార్చి, ఒకటేగది కట్టించాడు. ఆ గదిలో భార్యతో కూడా మాయమై ప్రపంచంతో సంబంధ కల్పించుకోడం ప్రారంభించనే లేదు.

ఎర్ర కలువవలె విచ్చిన ఆమె అందాన్ని చూసి అతను సమ్మోహను డైనాడు. ఎరుపు నునుపులో నించి క్రమంగా

తెలుపు నీడలలోకి మారే ఆమె తన దేహకాంతులూ, యెఱ్ఱగా కస్తూరి పరిమళంతో కూడిన పెదవులూ, ప్రియుడిముద్దుల నెరగక నిద్రపోతున్నట్లు, పొడుగైన కనుబొమ్మల కింద మూర్ఛలు పొయ్యే కళ్లూ, నున్నని రాళ్లమీద నించి దొర్లే ప్రవాహంలాగ మెరిసే బుజాల మీదనించి వేళ్లాడే జుట్టూ, నాజూకైన కంఠం చివర పెద్ద పువ్వువలె వికసించిన మొహమూ, ఆమెతీపి, నిదానమూ, బలువూ, తులసీదళాలూ, కర్పూరమూ, కుంకమూ, కలిసి యింకగా యేర్పడ్డ దేహ పరిమళమూ- యీ ఆభరణాలతో వొచ్చింది సుందరమ్మ అతని యింటికి. కాళిదాసు వర్ణనలూ, శంకరుడి దేవీ స్తవమూ, తన ప్రత్యేక స్వప్నాలూ, కలిసి, మూర్తిభవించి నట్టు తోచింది, సుందరమ్మ.

అతని తల్లీ, సన్యాసం పుచ్చుకుని సంసారాన్ని దయాగ్రహ్యదయులకు వొదిలి వెళ్లిన మేనమామ భార్యాపిల్లలూ, అతని బంధువులు. కనక అతనిసేవ అతిసౌఖ్యప్రదంగా జరుగుతుంది.

ఆ పైన గదిలోనించి వాళ్లకి, మామిడి చిగుళ్లమీద మంచుబొట్లూ, కాంతిలో కనపడకుండా దూసుకు పొయ్యే చిలకల రంగులూ, పచ్చని చేలమీద నీడలుపడేస్తో పయనమయ్యే మబ్బులూ, తప్ప యింకేమీ కనిపించవు. కోయిల కంఠమూ, జెముడుకాకి మూలుగూ, యీలపిట్టల కూతలూ,కలుపు కూలీలపాటలూ తప్ప యింకేమీ వినిపించవు. అవన్నీ చూశారో, లేక ఒకరినొకరు చూసుకోడంలో ప్రవత్తులైనారో, ఆశబ్దలన్నా విన్నారో, లేక అలిసి మూర్ఛిలుపోయి, అన్నిటికీ అతీతులైనారో! మొదట్లో వెన్నెల రాత్రులు తోటలోకి దిగివొచ్చారు. తరవాత మానేశారు. కొన్నాళ్లు ఉదయాన వొంటిగంటకి భోజనానికి దిగేవారు. అదీ మానేశారు. సుదంరమ్మే భోజనం పైకి తీసుకెడుతోంది. భోజనం వొండిపెట్టడం తప్ప కిందివాళ్లకీ పైవాళ్లకీ సంబంధం లేదు. కొత్తగా వొచ్చిన మైసూరు పండితుడి సారస్యము గ్రహిద్దామనీ, అపరూపమైన బంధువుణ్ణి ఆదరిద్దామనీ, తాము సాగుచేసే పొలాల అధికారిని చూడాలనీ, వొచ్చిన జనమంతా కిందనే తిరిగి పోతున్నారు. వాళ్లకేం జబాబు చెప్పాలో అతని తల్లికి తెలీటంలేదు.

పుట్టింటి నించి తల్లీ తండ్రీ వొస్తే, ఒకనిముషం కంటె యెక్కువ మాట్లాడడానికి సుందరమ్మకి వ్యవధిలేక పోయింది. ఎవరువెళ్లి తలుపుకొట్టినా తియ్యరు. కొట్టడానికి ఎవరికీ ధైర్యంలేదు. విననట్టె వుంటారు; వినబడదో! సుందరమ్మ కిందికి వొచ్చిందా, ఒక్క నిమషం ఆగదు, అతను యీలోపల మాయమౌతాడనో, విరహం భరించలేక మూర్ఛపోతాడనో - మాట్లాడదు - ఏడుస్తున్న చంటిపిల్లని వొదలివచ్చిన తల్లివలె, పైకి పరిగెత్తుతుంది. కిందికి నవ్వులూ, పరుగులూ, పాటలూ మాత్రం వినపడతాయి. అప్పుడప్పుడు-పూలూ, గంధమూ, కస్తురీ, తప్ప యింకే అవసరాలు లేవు పైవాళ్లకి.

ఇట్లా రెండేళ్లు గడిచింది.

ఒకరోజు పొద్దున్న సుందరమ్మ మేడ దిగివొచ్చి, అత్తగారితో -

“మీ కొడుక్కి జబ్బుగా వుంది” అంది.

నెలరోజుల కిందనుంచి, కొడుకు కొద్దిగా భోజనం తగ్గించాడని ఆమెకీ తెలుసు. కొడుకుమీద ప్రేమచేత, అతను తినగా వొదిలిన పదార్థాలున్న కంచాన్ని పరీక్షించి, అతని సాన్నిధ్యాన్ని కల్పించుకోవాలని ప్రయత్నించేది ఆమె. కాని ఆనంద భోజనం చేస్తున్నారేమో, [illegible] యీ భౌతికాహారం అక్కర్లేదేమో, కొద్ది దినాల్లో యిదీ సంపూర్ణంగా విసర్జిస్తారుగావు ననుకుంది ఆమె. బతికి వున్న యిరవై సంవత్సరాలలోనూ ఆమె భర్త ఆమెకున్న చాదస్తాన్నీ, నిశ్చయశక్తినీ, మూర్ఖాన్నీ, మనోబలాన్నీ, సంసారసుఖమనే పేరుకింద నాశనం చేశాడు. కనక పురుషుడంటే చాలా భయం, ఆలోచనలేని భక్తి, [illegible]ంచని అడకువా, చూపుతుంది.

వారంరోజులైనా కొడుకు జబ్బు తగ్గలేదు. విద్యుడికి కబురంపింది. మేడతలుపులు తియ్యక తప్పింది కాదు. ఆయన వొచ్చి, అల్లుడిలో మార్పు చూసి, చాలా భయపడి, చప్పున ఆయుర్వేద వైద్యుణ్ణి తీసుకొచ్చి మందిప్పించాడు. పదిహేను రోజుల్లో స్వస్థత కనపడ్డది.



కాని ఆవైద్యుడు, 'రోగి భార్యతో రెండు నెల్లవరకు కాపరం చెయ్యకూడద'న్నాడు. తండ్రి సుందరమ్మని తనతో తీసికెడతానన్నాడు. అల్లుడు వీల్లేదన్నాడు, కూతురూ రానంది. పత్యం మాత్రం చేస్తామని వొప్పు కున్నారు. కాని ఆరాత్రి కిందపడుకున్న కూతురు తెల్లా రప్పడికి మేడమీద తలుపు బిగించుకుని వుండడంచేత, తండ్రి దడిసి, కూతుర్ని బలవంతంగా ప్రయాణంచేసి తీసి కెళ్లాడు.

సుందరమ్మ తండ్రితో వెళ్లిందన్నమాటేగాని యింటి దగ్గిర, ప్రాణాలన్నీ అత్తవారింటో వొదిలివొచ్చిన దాని వలె, కదలక, మాట్లాడక, ఓమూల కూచుంది. కళ్ల నీళ్లు పెట్టుకుంది, మరీ బతిమాలి అడిగితే, "నేను లేంది, అయన బతకరు," అంటుంది. నాలుగో రోజు రాత్రి ఎవరో లేచి చూసేప్పటికి, అల్లుడు సుందరమ్మపక్కలో వున్నా డు. ఆరాత్రికి రాత్రి అన్ని మైళ్లు నడిచివొచ్చాడట— పొద్దున్నే మామగారు చివాట్లేశారు. అతను మాట్లాడ కండా విని చిరునవ్వుతో, "ఈ విషయం మీకర్థం కాదులెండి." అన్నాడు.

"ఇంటోంచి పొమ్మని యెట్లా అంటారు? సుందరమ్మ ని అందరి మధ్యా పెట్టుకుపడుకున్నారు. కాని పగలు ఒకర్ని వొకరు వదలరే! మాటిమాటికీ సుందరమ్మని పిలిచి పనులు చెప్పారు. కాని ఎంతసేపని ఎన్నిసార్లని కాపా డగలరు: - పనికాగానే అతని దగ్గిరికి ప్రతిసారీ పరిగెత్తు తోవుంటే! ఒకరాత్రి వేళ దొడ్లో చప్పుడయింది. మామ గారు గేదే యీనిందేమో నని వెడితే, తెల్లగా దెయ్యాలు రెండు కనబడ్డాయి. మంత్రం నీళ్లు మీద చల్లబోతే, కూతురూ అల్లుడూగా మారారు. మర్నాడు రాత్రి సుందరమ్మని తల్లి పక్కలో పడుకోపెట్టుకుంది, కాని

రాత్రివేళ లేచి వెళ్లిపోయింది సుందరమ్మ. తండ్రికి చాలా కోపమొచ్చింది.

"ఇంతమాత్రం జ్ఞానం లేక పోతే ఎట్లా?"

"నీకు అర్థం కాదు నాన్నా!"

"నిజంగానే అర్థం కావటం లేదు, ఆరోగ్యం చెడగొట్టుకుని ఏం బావుకుందామని! అతనిమీద నిజమైన ప్రేమవుంటే అతన్ని రక్షించడమే ముఖ్యంగా పెట్టుకుంటావు. ఇది పిచ్చి."

"ఆయన నిలవలేరు. నేనేం చెయ్యను?"

"బుద్ధి చెప్పు."

"నా చాత కాదు."

మర్నాడు రాత్రి అల్లుడే వొచ్చి తల్లీకూతురూ పడుకున్న మంచం పక్కన కూచున్నాడు. సుందరమ్మ రానంటుంది, అతను మాత్రం వెళ్లాడు. ఇంక ఇంటో వాళ్లందరికీ విసుగెత్తి, ఏమనడానికీ తోచక, అసహ్యమేసి, ఈ కొత్త జబ్బుకన్న, ఆపాతజబ్బే నయంగా కనపడి, యెవరి కర్మప్రకారం అట్లా జరుగుతుందని వూరుకున్నారు. ఐదో రోజున అల్లుడు మళ్లి పక్కవేశాడు, కాని భార్యని వొదల లేదు.

తండ్రి మళ్లీ సుందరమ్మని గట్టిగా చివాట్లు పెట్టాడు.

"ఏమే, నీ మొగుడికి బతకాలని లేదా యేమిటి? ఏదో వొకటి చెప్పండి. బోలెడు డబ్బుపోసి ఆమందులు కూడా కర్చెందుకు?"

సుందరమ్మ పెద్దగా యేడ్చింది.

"లాభంలేదు, నాన్నా! ఆయన నాకు దక్కరు. ఆ సంగతి ఆయనకీ తెలును. జాతకంలో ఇంతకన్న ఆయుస్సులేదు ఆయనకి. నేను కనపడకపోతే మరీ కొట్టుకుంటారు, ఆ నిమిషాన్నే ప్రాణంపోతున్నట్టు. కనపడితే సరే సరి. కాని నాన్నా, నాకర్మప్రకారం జరుగతుంది. నువ్వు వూరికే చింతపడి ఏంలాభం? నా గతి తప్పించడం నీతరమా?"

ఏమంటాడు? చిన్నప్పణ్ణించీ తను మాట్లాడినవీ, తరతరాల నించి వంశంలో నమ్ముతున్నవీ, జాతకాలూ, కర్మా, ఆమాటలు [illegible] కూడా నేర్చుకుని, విశ్వసించి, జవాబు చెపితే! ఏమంటాడు?

పదహారో రోజున అల్లుణ్ణి భూశయనం చేశారు.

అతనికేమీ బాధలేదు, నిండుస్పృహములో వున్నాడు. కాని నూనె అఖరైన దీపంవలె కుంకి పోతున్నాడు. ఇంకా ఒకచెయ్యి మీదపడి యేడ్చే సుందరమ్మ మెడమీదనే వుంది. అందర్నీ పొమ్మని పొజ చేశాడు.

"యేడవకు, కాలగతికి మనమేం చెయ్యలేము. ఈ రెండేళ్ల స్వర్గం తరవాతా చావంటే నాకు వ్యసనం లేదు. నిన్ను వొదలడమే నా విచారమల్లా. కాని నిన్ను వొదలను. నాచావు తరవాత కూడా నిన్నే అంటిపెట్టుకుని వుంటాను. ప్రతినిమషం నీతోనే వుంటాను. నీ జన్మానికంతా నేనే నీభర్తని" అన్నాడు.

"నేనూ మీవెంటనే వొస్తున్నా!" అంది.

కాని అతను మాట్లాడలేదు. మామగార్ని పిలిచాడు.

"మీరు నాకొకటి వాగ్దత్తం చెయ్యాలి. నేను పోయినా దానిలో నివసించబోతున్నాను. దాని అందాన్ని అమితంగా ప్రేమిస్తున్నాను. దాన్ని వికారం చెయ్య వొద్దు. చెయ్యనని ప్రమాణం చెయ్యండి. కనపడక పోయినా దానికి భర్త వుండనే ఉంటాడు." అని అత్తమామలచేత ప్రమాణం చేయించుకున్నాడు.

"మీ కూతుర్ని ఏ అఘాయిత్యం చెయ్యకండా కాపాడండి. ఇదుగో, చావు సహజంగా వొస్తే రానీ, మళ్లం కలుసుకుందాము. కాని బలవంతంగా ప్రాణం తీసుకున్నావా, నువ్వు నాకు అందవు. చచ్చిన నన్ను మళ్లీ హత్యచేసినట్టే."

భర్తపోయిం తరవాత సుందరమ్మని బతికించుకోడం చాలా కష్టమయింది. ఆర్నెల్లు పెద్ద జబ్బుపడ్డది. అందులో స్పృహలేని జాడ్యం. నయమైన తరవాత కూడా మాట్లాడదు, తిరగదు, తినదు. చీకట్లో ఓమూలకావిడి పెట్టెమీద కూచుంటుంది, ఇరవై నాలుగు గంటలూ; అక్కడే నిద్రవొస్తే పడుకుంటుంది. లేచి కూచుని వుంటుంది. చీకట్లోనే ఎవరితోనో రహస్యంగా మాట్లాడుతుంది, తలుచుకు తలుచుకు ఏడుస్తుంది. నాభోటి బంధువు

వాళ్లయింటికి వెడితే, ఒకమూల, సన్నగా, వొదిలి, తెల్లగా, పొడుగ్గా, నల్లని పెద్దజుట్టు విరబోసుకుని, చీకట్లో, కోలకళ్లలో మెరిసె గుడ్లతో వెర్రిగా చూస్తో, కనపడుతుంది. అంత చీకట్లో, అంత విచారంలో, ఎంత అందంగా వుందని! ఈ లోకానికి సంబంధించిన కొవ్వూ మాంసమూ కరిగిపోయి, ఆత్మకి సంబంధించిన, మెరుగు శరీరంలోనూ, కాంతి కళ్లలోనూ కనపడతోందని పిస్తుంది. సౌందర్యాన్ని, ముఖ్యం కళ్లలో ప్రకాశించే ఆత్మ ముఖానికిచ్చే సౌందర్యాన్ని వొదలక వెర్రిపడే నేను ఆమెని చూసి, అక్కడే ఆచీకట్లోనే ఆమెని చూస్తో ఆరాధిస్తో కూచోడానికి వీలవుతుందా, ఆశరీరంలోకి, కొత్తబలాన్ని, ఆకళ్లలోకి కొత్తవుత్సాహాన్ని తేప్పించే మార్గమున్నదా, అని తపనపడ్డాను.

కొత్తలో స్మశానానికి పోయి, తెల్లార్లూ బిగ్గిరిగా అతన్ని పిలుస్తో యేడ్చేదిట.

ఇట్లా మూడు సంవత్సరాలు గడిచింది. సుందరమ్మ యింకా ఆమూల అట్లానే కూచునివుంది. వొళ్లంతా పాలిపోయింది-కాని తేజస్సు ఒకరవ్వ చెడలేదు. గంభీరం యెక్కువయింది. తపశ్శాలినివలె తోస్తుంది. మాట్లాడదు. కదలదు.

(సశేషం)


# గుణము లేకపోయిన 5 రూపాయలు వాపసు చేయబడును

# గర్భ సంజీవి తైలము



స్త్రీలకు బహిష్ఠ కాలమున వచ్చు ముట్టు కుట్టును ఈ మందు తత్క్షణమే పోగొట్టును. మాసాంతమునకు సరిగ బహిష్టలు కాని స్త్రీలకు సాధారణముగా వచ్చు రోగములన్నిటిని, అనగా దగ్గు, అంటుకుట్టు, జ్వరము, వాయువు, అసంపూర్ణ రక్త స్రావము, తలదిమ్ము, తలనొప్పి, ఒళ్లు నొప్పి, కీళ్ల నొప్పులు, దేహము ఉబ్బుట, కడుపు పెరుగుట, లేవలేనట్టి బడకము, తల తిరుగుడు, మూర్ఛ, ఆకలి లేకుండుట, భోజన మన్న అసహ్యము, ఒక చెంబు నీటినికూడ ఎత్తలేని బలహీనము, సన్నిపాతము మొదలగు వ్యాధుల నన్నిటిని ఈ తైలము పోగొట్టి, గర్భమును శుద్ధిపరచి, సంతానమును కలిగించును. ఆను విధము లయిన గొడ్రాలితనమును పారద్రోలును. గర్భోత్పత్తికి అడ్డము వచ్చు క్రిమి జాలమును చంపివేయును. దృఢ గాత్రులును, పూర్ణాయుష్కును అగు సంతాన మును కల్గించును.

ఒక స్త్రీకి మూడు బుడ్ల మందు ఉపయోగింపవలెను. ఒక బుడ్డి ధర రు. 2-0-0. 3 బుడ్లు రు. 5-0-0.

తపాలా ఖర్చులు వేరు.

పళనివైద్య ఆసిరియర్, ఆర్. ఎమ్. కె. వేలుస్వామి పిళ్లె

ముఖ్య కార్యాలయము; (హెడ్ ఆఫీసు) పళని: సిద్ధ వైద్యశాల 146 పరశువాకం హైరోడ్డు: మద్రాసు

ఉత్తరములు యింగ్లీషులో వ్రాయడం మంచిది



# ప్రత్యేకం

—'చలం'

(వెనకటి సంచికలో కథ: సుందరమ్మ వంశం చాలా పూర్వాచారా భూయిష్టం అయినది. ఆయింట్లో స్త్రీలూ పురుషులూ అంతా అర్థాయుస్సులో చచ్చిపోయి దయ్యాలుగా మారి ఆయింటినే పట్టుకొని వేళ్లాడడము అలవాటయి పోయింది. ఏదోషమూ లేకుండా ఎంత నిష్ఠా గరిష్టతో వున్నప్పటికిన్నీ ఆ కొంప శాపగ్రస్త మయినది లాగా అయిపోయింది. ఆకుటుంబం వాళ్లంతా తగినంత ధనాఢ్యులున్నూ – పల్లెటూళ్లో వుంటూ ఏ ఆధునిక విషయాలతోనూ ప్రసక్తి లేకుండా వుంటూ వున్నారు. సుందరమ్మ ప్రబంధాలలోనూ, సంస్కృత కావ్యాల లోనూ వర్ణించిన కావ్యకన్యలాగా త్రిజగన్మోహమయిన రూపముతో పుట్టింది. అల్లారు ముద్దుగా పెరిగింది. ఎనిమిదో ఏటనే మేనత్త కొమారుడికిచ్చి వివాహము చేసినారు. పెనిమిటి మైసూరు సంస్కృత కాళాశాలలో ప్రాచీన శాస్త్రాలన్నీ అభ్యసించి యుక్త వయస్సు రాగానే యింటికిచేరి భార్యను కలిసినాడు. ఆ దంపతుల అన్యోన్యము చెప్ప శక్యముగాదు. కామువ్యాపార పరతంత్రులయి వారుభయులున్నూ సమస్తమూ చివరకు నిద్రా ఆహారమూ కూడా మరిచిపోయి మేడ మీది గదిలోనుంచి కిందికి దిగకుండా వుండి పోయినారు. క్షణలేశ మయినా ఒకరి నొకరు విడిచిపెట్టి వుండలేరు. పెనిమిటికి జబ్బుచేసినా అతను సుందరమ్మను వదిలిపెట్టి వుండలేక పోయినాడు. తలిదండ్రులు చివాట్లు పెట్టినా వైద్యుడు శయ్యాపథ్యము అని చెప్పినా ప్రయోజనం లేకపోయింది. చివరకు వ్యాధి ముదిరిపోయింది. అయితే జాతకరీత్యా తనకు ఆయుర్దాయము లేదని చెపుతూ ఆంతవ్యాధిలో కూడా సుందరమ్మను భర్త వదలలేక పోయినాడు. తనుపోయిన తర్వాత సుందరమ్మను విరూపము చేయకుండా వుండడానికి వాగ్దానము చేయించుకొని పెనిమిటి మరణించాడు. పెనిమిటి పోయిన తర్వాత సుందరమ్మ దుఃఖముతో బ్రతుకుతుందనే ఆశలేకుండా పోయింది. అయితే ఆమె దేహములో ఎంతో మార్పు వచ్చినా ఆమె ముఖంలో వున్న తేజస్సు మాత్రం తరిగి పోలేదు. భర్తపోయిన తర్వాత మూడు సంవత్సరాలు గతించి పోయినవి.

ట ౹ంటి సంచికలో కథ ఆగిపోయింది.

తండ్రి చచ్చిపోయినాడు. బతికి వున్నన్నాళ్లూ అతని ఆస్తి సంగతి యెవరికీ తెలీదు. ఆయనకే తెలీదేమో! ఆర్నెల్లల్లో అప్పుల వాళ్లు అన్నీ వేలాలు వేశారు. ఇంటో చేరిన వితంతువులూ, బ్రహ్మచారులూ యెక్కడ వాళ్లు అక్కడ సద్దుకున్నారు. సుందరమ్మనీ తల్లినీ యిల్లు విడిచి పొమ్మన్నారు. సుందరమ్మ భర్త ఆస్తి వుంది. కాని దానికోసం యెవరి నడగాలో, యెట్లా తెచ్చుకోవాలో తెలీదు. లోకమంటే యెరగరు. గూడు పోయిన పిట్టల వలె దిక్కులు చూస్తో కూచున్నారు. చివరికి బెజవాడలో వున్న సుందరమ్మ మేనమామ వెంకట్రామయ్యకి యీ సంగతి తెలిసి, తల్లినీ కూతుర్నీ రమ్మని వుత్తరం వ్రాశాడు.

ఆయింటో చీకటి మూలనించి కదిలి - బైటికి - కాదు- ఆయిల్లే విడిచి, ఆ వూరే, యెరిగిన మనుషుల్నే విడిచి, తానెన్నడూ చూడని, లోకంలోకి, తల్లి తప్ప ఏసహాయమూ లేకండా వెళ్లాలంటే, సుందరమ్మకి చాలా భయం వేసింది. తను ఆడుకుని, జన్మ అంతా తనకి శరణ్యంగా వుంటుందనుకున్న యింటిని యితరులు ఆక్రమించుకుని, తమ పూజా స్థలాన్ని, తాము ఇతర కులాలవాళ్లని అడుగన్నా పెట్టనీని పవిత్ర ప్రదేశాల్ని, యిష్టం వొచ్చినట్టు భక్తి లేకండా వుపయోగిస్తారు. తమని నమ్మి, ఆయింటిని ఆశ్రయించుకుని పూజలు పొందే దేవతలు పాపం యేమవుతారు? చివర వరకూ ఏదో అద్భుతమైన స్థితి తటస్థిస్తుంది, ఎక్కడో ధనం దొరుకుతుంది. ఎవరో సహాయ పడతారు. ఇన్నాళ్లు పూజలు పొందిన దేవతలు తమను యీ ఆపత్సమయంలో ఆదుకోగా అనే ధైర్యంతో యేమీ యోచించ లేదు - కాని ఆ దేవతలనే వాళ్లు వున్నారో లేదో, యిన్నితరాలు వూరికే వుత్త అర్థం లేని పేర్లకే, ఏమీ లేని ఊహలకే, ఆ శక్తి లేని బొమ్మలకే పూజలు, ప్రార్థనలు, నైవేద్యాలు, ధనము, శక్తి, కాలము, అంతా, అవివేకులై, ధారపోశారో! ఆదేవతలు వున్నా వాళ్లకి సుందరమ్మకు సహాయం చేసే శక్తి వుందో లేదో!...వాళ్ల కన్న బలవంతులైన దేవతలు యీ వంశం చేత పూజలు పొందని వారు అపకారం సాగించారేమో!

ఇవన్నీ సుందరమ్మ ఆలోచించ లేదు. విశ్వాసానికీ, సమన్వయం కుదర్చాలని ప్రయత్నం చేసే నా వూహాలే గాని!

తనకర్మ యిట్లా వుంటే, దేవతలేం చేస్తారనుకుంది. ఆ వొక్క ఆలోచనతో, ఆమెకి మనుషుల మీద గాని, దేవతల మీద గాని, యేద్వేషమూ, నిరాశా, తోచనే లేదు. కన్నీళ్లతో ప్రతిగదినించీ, దొడ్లో చెట్టునించీ, దేవతల ఆసనా స్థలాల నించీ శలవ తీసుకుంది. సామాను సద్దాలి. సుందరమ్మ తన విచారాన్ని మరిచి తిరగాలి, ఆమెకి కాళ్లనూ, చేతుల్నీ, కదిల్చే అలవాట్లే పోయినాను. కళ్లు కూడా కాంతిని భరించలేవు. ఆమె బైటికి వొచ్చిందంటే, చూడడానికని, వూరంతా మూగారు.

అధికార ఐశ్వర్య పదచ్యుతి పొందిన మనుషుల మీద లోకానికి వున్న కోపం యెవరి మీదా వుండదు. తమ



స్థానాన్ని నిలబెట్టుకోలేని వాళ్లు, తమ కన్న అధికులమని ఇన్నాళ్లు తమని మోసం చేశారే అనుకుంటారు. ఔన్నత్యంలో వున్నన్నాళ్లు, ఆమనుషులే, వాళ్ల స్వభావం లోనే ఔన్నత్యం వుందనుకుంటారు. అధికారమూ, ధనమూ, 'ఛాన్సు' వల్లగాని, అదృష్టం వల్లగాని తటస్థించిన విషయాలనుకోరు. కాని పతనం కలగగానే, వాళ్లు కూడా తమవంటి సామాన్యులేనని తెలుసుకుని మండిపడతారు. ముఖ్యంగా అందులో, ఆ దీనత్వంలో కూడా అహంకారాన్ని పూని, తమ వద్ద ఆశ్రయించని ధీరుల్ని చూస్తే, ఉగ్రత్వాన్ని తెలుస్తుంది లోకం - పాపం! అని పెదవులతో అని, చాటుగా ఒక్కరాయి విసురుతుంది.

కాని లోకంతో సంబంధం మానివేసుకున్న సుందరమ్మకి ఇవేమీ కనపళ్లేదు. అగుంపు పంక తలన్నా యెత్తలేదు. కాని ఆమెతల్లి గుంపులో వాళ్లని తిడుతోంది.

సామాను సర్దాలంటే, తల్లి ఏమీ వొదలక అన్ని మూటలు కడుతోంది, రోళ్లు, బోషాణం, వడ్లబస్తాలు - అన్నీ, సుందరమ్మకి కూడా ఏమీ తెలీదు. బళ్లవాళ్లు వొచ్చారు. సహాయానికై పొరుగువాళ్లు వొచ్చారు. వాళ్లని యింట్లోకి రానీదు. బ్రాహ్మలు కావాలంటుంది, తల్లి.



“రేపన్నించి యెవరు తిరుగుతారో! వాళ్లనిరానీ” అంది సుందరమ్మ - కాని లాభంలేదు.

చివరికి కరణంవొచ్చి, ఆ సామానులన్నీ తీసి కెళ్లడానికి వీలులేదనీ, రైలుఛార్జీ, బెజవాడలో యింట్లో స్థలమూ, ఇవన్నీ మాట్లాడి వొప్పించాడు ఆమెని. దేవతలూ, దేవతార్చన సామానూ, ఎవరినీ తాకనీ లేదు. వూరగాయ జాడీలో! అన్నీ ఒక బ్రాహ్మణ్ణి పిలిచి దానంచేశారు. పదేళ్ల కిందపెట్టిన వూరగాయలు కూడా వున్నాయి.

సుందరమ్మా తల్లీ కలిసి దేవతల్ని బండీలో యెక్కించారు. వీళ్లు సరిగా బెజవాడ చేరతారా అని అనుమానంగా వుంది వూరివాళ్లకి.

రైలులో యెక్కగానే వికారపెట్టింది సుందరమ్మకి. ఆపెట్టెలో వాసనే ఘోరమనిపించింది, నిర్మలమైనగాలి అలవాటైన ఆమె ముక్కుకి. ఇంతలో ఒక ఆమె చుట్ట వెలిగించింది. కొంత సేపటికి ఒకామె లెవటరీ తలుపు తెరిచింది.

“ఇంకెంతసేపు వుండాలి అమ్మా, యీ నరకంలో మనము?”

“ఓ గంట వుండాలేమో!”

“ఎందుకూ ఆమనిషి లోపలిక వెళ్లింగి?”

“అది పాయిఖానా దొడ్డి.”

ఆమనిషి వొచ్చింది—

“మరి కాళ్లు కడుక్కోదేం? చేతులు కడుక్కోదేం?”

వాళ్లవూళ్లో స్నానం చెయ్యడం మామూలు.

“నీళ్లేవీ యిక్కడ?”

“మరి— —”

“మాట్లాడకు, అది వింటోంది.”

మాటలు వినాలని ఆ పాలెమనిషి యింకా దగ్గిరికి వొచ్చింది.

"కొంచెం దూరంగా కూచో. అట్లా దగ్గిరికి వొస్తా వేం?" అంది తల్లి.

"ఏం ఆచోటు చాలదూ నీకు? ఇదంతా నువ్వే కొనుక్కున్నావా?"

తక్కువ జాతి స్త్రీ అట్లా మాట్లాడడమే! సుందరమ్మ రక్తం వేడెక్కింది. స్వభావంలోనే వున్న అధికార గర్వం అణగక పోట్లాడింది.

పక్క స్టేషనులో ఇంకో ఆమె యెక్కి వీళ్ల ముందుగా వెడతోంది.

అదృష్టంలో తమకు సమానమైనా, వంశంవల్ల అధికుల మని సూచించే ఆ బ్రాహ్మల్ని క్షమించ తలుచుకోలేదు ఆసాలెమనిషి.

"అట్లా వెళ్లకండమ్మా! వారు ఆదేంచీనంతా కొనుక్కున్నారుట!"

"కొనుక్కోడమేమిటి?" అని వాళ్ల పక్కనే చతికిల పడ్డది.

"ఎక్కడనించి, మరియమ్మా! నువ్వు!"

"ఈవూళ్లో కాన్పుచేసి వొస్తున్నానమ్మా!"

"ఎవరేనువ్వు!" అంది తల్లి.

"ఎవరే ఏమిటి? ఏంగొప్ప!"

"మరి కాపుచేసి, స్నానంచేశావా?"

"స్నానం? అదంతా మా బ్రాహ్మలు! కిరస్తానీలం మాకా పిచ్చిలేదు."

"ఛీ, ఛీ, కిరస్తానివా? దీంట్లో యెక్కావేం?"

ఆమూలకూచో.

నివ్వెరపోయి చూసింది మరియమ్మ.

పెట్టెలో వాళ్లంతా ఆశ్చర్యంతో వేళాకోళంగా చూస్తున్నారు.

"ఈమూట యెందుకూ, పైన పెట్టండమ్మా!"

అంటో తియ్యపోయింది.

"తాకకు, తాకకు"

"మరితియ్య"

"ఎక్కడిది పెట్టను"

"కిందపెట్టు"

"వుమ్మ్లు - అవి మాదేవతలు"

"దేవతలు - దేవతలు! మట్టిబొమ్మలా? కొయ్యబొమ్మలా? నీ దేవుళ్లా నువ్వూను! పెంటలో పారెయ్యి"

అని మూటని లాగింది. సుందరమ్మ సహించలేకపోయింది. పెదిమ వొణికింది, తన దేవతల్ని, వందల కొలది యేళ్లనించి పూజించిన సుందర విగ్రహాలని - కంఠం వొణికింది. కళ్లలో నీళ్లు కమ్మాయి. నుంచుని చెయ్యిజాచి

"నువ్వు, నువ్వు ... మాలదానివి ... నీచురాలివి ... అంటుదానివి ... మాదేవతల్ని ... తాకుతావా? తాకి బతుకుతావా? నీతల వెక్కలుకాదా! జాగ్రత్త" అని గంభీరంగా పలికి, వొణికి కూలబడి కళ్లుమూసుకుంది. మరియమ్మ పక్కున నవ్వింది. కాని బండీలో వాళ్లంతా ఆమె ఆవేశము, ఆమె సౌందర్యము, ఆ వాక్యాలలోని వాస్తవమైన ధ్వని విని ఆశ్చర్యపడి చూశారు—

మరి ఆదేవతలే వున్నారో, లేక సహజశక్తులే కరుణించారో, లేక "ఖాన్సు" అట వున్నదో, తెరిచి చూస్తున్న మరియమ్మ తలమీద కిటికీ చెక్క జారిపడ్డది. గాయమై రక్తం కారింది.

బ్రాహ్మణద్వేషంలో పరిమితపడ్డానికి వొప్పుకొప్పని హిందూ హృదయాలన్నీ సుందరమ్మ పాదాక్రాంతాలైనాయి.

"చూశారమ్మా, దేవతలమహిమ!" అని అట్లా జరిగిన నిదర్శనపు కథలు చెప్పుకోడం మొదలు పెట్టారు. కాని ఒక్కరూ మరియమ్మకు సహాయం చేసినవాళ్లు లేరు.

తెనాలి స్టేషన్లో "దిగండి, దిగండి" అని అరుస్తున్నారు. అందరూ దిగారు. తల్లీ సుందరమ్మా యింకా సామాన్లు దింపుకుంటున్నారు.

"ఇంకా యేమిటి దింపుతున్నావూ? బండీ వెనక్కి కదలుతోంది. ఏ పిల్లా! దిగు! దిగు"



"ఇంకోమాట వుంది. అమ్మాయి వెళ్లవే."

సుందరమ్మ తలుపుదగ్గిరికి వొచ్చేప్పటికే రైలు కదిలింది. "జాగర్త" అంటో ఆయన జబ్బపట్టుకో పోయినాడు. తప్పించుక దూకింది. తాను వెల్లకిత్తలా పడ్డది. మూట రైలుసందున పడ్డది. మూటయెత్తి యివ్వడం బదులు, తిడతున్నాడు ఆయనలేచి నుంచుని. ఆయనవంక చూసింది కోపంగా. చప్పున గొంతుతగ్గించి, పోయినాడు ఆయన. బాగా దెబ్బతగిలింది. కళ్లంబడి నీళ్లు తిరుగుతున్నాయి. తల్లికి చెప్పలేదు. ఆమె దేవతలమూట మొయ్యలేక సుందరమ్మ బుజాన పెట్టింది. ప్రసంగాలన్నీ మోసే దేవతలు, సుందరమ్మ బుజానికీ భారమైనారు.

ఇదేమిలోకమా, నిజమా, కలా, అని చూస్తో నుంచుంది.

"ఎక్కడికి?"

"బెజవాడ?"

"వెళ్లరేం? రైలుపోతోంది"

"ఎక్కడా? నాయనా, యీనాలుగు మూటలు తీసుకురా"

"నేనా?" అంటో పోయినాడు, సుందరమ్మవంక, ఆమె సిగ్గుపడేట్టు చూస్తో.

ఎవరూ సహాయం చెయ్యరేం? వూరికేనే తిరుగుతున్నారు చాలామంది! తమకష్టం కనపట్టంలేదూ?

బెజవాడరైల్లో మొగవాళ్ల పెట్టెలో యెక్కారు. వితంతు వివాహం చేసుకున్న ఆయన తేటపడ్డాడు. తలవెంట్రుకలున్న వితంతువుని చూసేప్పటికి, అతని మనసు తహతహలాడి పోయ్యింది. ఎదురుగా కూచుని ఓ. అంటుకోళ్ల ఆయన, పనిలేక వాళ్లని ప్రశ్నలడుగుతున్నాడు, వూరు, పేరు, గోత్రం, అత్తవారి యింటిపేరు, తాతపేరు - ఎదటవాళ్ల అయిష్టం గుర్తించ తెలుసుకోరు - వొదలరు. ఆప్రశ్నలకు తల్లి మెల్లిగా జబాబు చెపుతో వుంటే, వాళ్ల సామానులన్నీ వీధులో పారేస్తే యెట్లా వుంటుందో అట్లావుంది సుందరమ్మకి. చెప్పకపోతే, కోపమొస్తుంది. వెక్కిరిస్తారు. రిఫార్మరుకూడా చేరాడు.

"అమ్మాయికి వైధవ్యమొచ్చి యెన్నేళ్లు?"

"పిల్లలా?"

"నగలు వున్నాయా?"

"అత్తవారి వూరు?"

ఇట్లా అడిగి అడిగి ఒక్కనిమిషం సందేహించి,

"అమ్మాయి యవ్వనమంతా వృథాగా పోతోంది" అని పెద్దనిట్టూర్పు విడిచాడు. కలవర పడుతున్న సుందరమ్మ ముఖంచూసి పక్కన వున్న చాదస్తుడు అందుకున్నాడు.

"ఆ యవ్వనం పురుషుడి వుపయోగార్థమా?"

"కాదా?"

"ఏమీ దేవతల కర్పణ కా కూడదా?"

"దేవతలేమిటి? పాపం ఆ అమ్మాయి బాధ మీ కేం తెలుసు?"

సుందరమ్మకి తనను చీర విప్పి నుంచో పెట్టినట్టయింది.

"అమ్మాయీ, నీకు చక్కని పెనిమిటిని తీసుకొస్తాను చూడూ"

"మే మట్లాంటివాళ్లం కామండి" అంది తల్లి.

కోప మొచ్చింది ఆయనకి

"అట్లాంటి వాళ్లమంటే, మేమేం చెడిపోయిన వాళ్లమా?"

"ఏమోలెండి, మీసంగతి మా కెందుకు?"

"ఈనాడు మీకు తెలీదు. చివరికి మీరే విచారిస్తారు నామాట వినలేదని! మీ వుద్దేశ్య మేమిటి! పునర్వివాహం పాపమనా? ఎందుకు పాపము? మొగవాడు పెళ్లిచేసుకుంటే సరే—"

అంటూ మామూలు కారణాలు మొదలుపెట్టాడు. వితంతు వివాహం, పాపం కాని కాక పోనీ, పుటకవల్ల, అలవాట్లవల్ల, సాంప్రదాయంవల్ల, పునర్వివాహాన్ని ఏవగించుకునే వాళ్లు వున్నారని, భావన చేసుకోలేదు. స్పష్టంగా తెలిసే యీ మాత్రపు సంస్కారణాన్ని అర్థం చేసుకోలేరేమా అనుకుంటాడు. మూఢదేశమని తిడతాడు. కాని తన కులాభిమానమూ శాకాహార నియమమూ, శివార్చనా, అన్నికూడా హేతువాదానికి నిలబడవని అతను పరీక్షించుకోలేదు. వృథాపొయ్యే ఆమె యవ్వనం మీద దయేగాని, అటువంటి భావమే లేని ఆమె మనసులో తాను కదిలిస్తున్న వికారాల్ని గురించి తలుచుకోడు. ఆ సౌందర్యం ఏపురుషుడి కళ్లనో ఆనందపరిస్తేనే కాని నిష్ప్రయోజన మనుకోడం న్యాయమో కాదో యోచించ లేదు.

అదృష్టవశాత్తూ బెజవాడ వొచ్చింది. ఆమె యవ్వనాన్ని గురించి వ్యసనపడ్డ మనిషి సుందరమ్మ మూడు మూటలు మోసుకు పోతోవుంటే చూసి, ఆలేత ఎమికలు పడేబాధను గుర్తించక, తన బావమరిదితో నవ్వుతో వెళ్లిపోయినాడు. షికారుగా వొచ్చిన సోమయాజులు అనే కుర్రాడు చూశాడు. సుందరమ్మని చూడగానే ఆస్టేషనులో చప్పున దీపాలు ముట్టించినట్లు మిరుమిట్లు గొలిపాయి. అతనికళ్లు కుష్కించిన చేతులతో ఆ మూటలు పట్టుకుని, వొంగి, బాధ భరించలేక కళ్లలో నీళ్లు కుక్కుకునే ఆపిల్లనిచూసి.

"నేను తెస్తాను" అన్నాడు బిడియంగా.

"బ్రాహ్మలా?"

"అవును."

ఇచ్చింది. బండీదాకా తెచ్చాడు. సామానులు బండీలో పెట్టారు. ఒక్కమాట మాట్లాడకుండా, తిరిగి చూడకుండా సుందరమ్మ బండీలో యెక్కింది.

అట్లా ఆబండికేసి చూస్తో, అర్థంకాని బాధని, అనురాగాన్ని, లోపల అణుచుకుంటో, నుంచున్నాడు సోమయాజులు. కొందరు స్త్రీలు (పురుషులుకూడా) ఎదో తెలీనవి, ఎన్నడో మరిచిపోయినవి, కొంచెంగా స్ఫురణకు వచ్చి బాధ పెట్టేవి, ఎవో సంబంధాలను, అందాలను తోపించి, మరపురాని, బాధను కలిగిస్తారు. పాపం సోమయాజులు ఆమె రూపాన్ని వొదలలేక వొదలలేక, దృష్టిని మరల్చాడు. కాని (నీ బాధ ఎట్లా పోతుంది? నీ [illegible] ఏమిటంటే!' చెప్పలేడు. టాగోర్ మహోన్ని, హిమాలయ శిఖరాల్ని పండువెన్నెల రాత్రిని చూస్తే కలిగే బాధకూడా అంతే కదా!

సుందరమ్మ మనసులో సోమయాజులేడు. ఎక్కడికి? ఏ యిల్లు? ఎవరుంటారు? తనని ఆదరిస్తారా! ఏ కష్టాలు ప్రాప్తిస్తాయో! తన గతి యేమవుతుందో! అనుకుంటోంది.

జీవితం ఆమూల రక్షణలోనున్న శిష్టాచారపరురాల్ని సుందరమ్మని, మోసగాళ్లు, క్రూరులు, నీచులు, ఆచార రహితులు, నూతన విద్యాపండితులు, ధనాన్వేషకులు వుండే యీ క్లిష్టమైన లోకం మధ్య పారేసింది, ఏమాత్రమూ కరుణలేకుండా, తామరపువ్వును ముళ్ల కంచల మధ్య పెద్దగాలి పడవేసినట్టు.



# ప్ర[illegible]

— 'చలం'

వెంకట్రామయ్య శ్రోత్రిగా పట్టణవాసాని కలవాటు పడ్డ బ్రాహ్మణుడు. ఆ జీవితాన్ని కాలానుగుణ్యంగా మార్చుకునే భాగాలన్నీ ఆయన తండ్రి కాలంలోనే జరిగిపోయినాయి. కొన్ని పనులు బ్రాహ్మణులు చెయ్యకూడని పనులని స్ఫురించడం కూడా మానేసింది ఆయింట్లో వాళ్లకి. దిక్కు లేక వచ్చి యింట్లో చేరిన పల్లెటూరి సుందరమ్మకీ, తల్లికీ, ఏదో కొత్తచిత్రలోకానికి వొచ్చినట్టుంది. కంచాలల్లో తినడమూ, మైలబట్టలతో పీటలమీద కూచోడమూ, స్వంతంగా క్షవరం చేసుకోడమూ, చాకలి తోడిన నీళ్లు స్నానం చెయ్యడమూ చూసి, విభ్రాంతులైనారు. తల్లి వెంటనే, అన్నమే మాని, స్వయంగా రొట్టె కాల్చుకుని ఒకమూల తింటోంది. కాని సుందరమ్మకి కర్మక్షీణం తప్పలేదు. మొదట్లో 'ప్రొటెస్టు' చెయ్యాలని పించింది. కాని కొత్తయిల్లు, తెలియని మనుషులు, హక్కూ లేదు, దిక్కూ లేదు. వూరుకున్నది.

కాని 'నెసెసిటీ' ప్రాణాలు నిలుపుకోవలసిన అవశ్యకత, కొత్తలోకాన్ని చూసి భయం, ఇవన్ని యీదేశాన్నంతా యట్లా బలవంతంగా మార్చివేశాయో, అట్లానే సుందరమ్మని మార్చాయి. ఈ యిద్దర్నీ వెంకట్రామయ్యగారి కుటుంబం ఎంతో ఆదరించింది. ప్రేమ చూపింది, వాళ్లు రావడమే ఘనతగా ఎంచింది. కాని వీళ్లకోసం వాళ్ల ఆచారాలను రవ్వంత కూడా మార్చుకునేట్టు లేరు, లోకం త్యజించినట్లైనా, ఆఫీసుకెళ్లేది భోజనం [illegible] కావాలి. ఆయన సౌఖ్యమునే సూత్రం మీద ఆ సంసారచక్రం తిరుగుతోంది. ఏమార్పు కావాలన్నా ఆయనకీ, ఆయన సుఖానికీ 'రిఫర్' చేస్తారు. ఆయనతో చనువుగా మాట్లాడ్డానికి, ఆయన భార్యకీ, కూతురుకీ, గుండెలు లేవు. ఆయన ఆఫీసు లోకంలో, యీ ఆచారాలు, సెంటిమెంట్లు పరిచయాలు, వ్యక్తిత్వాలు వీటికి వేటికీ ప్రవేశం లేదు.

సుందరమ్మ ఆచారమంతా అలవాటే గాని, ఒక్కటీ 'ప్రిన్సిపుల్' కాదు, కనక కొత్త వాతావరణంలో చాలా తొందరగా 'ఎడ్జస్టు' అయిపోయింది. కాఫీ కూడా తాగింది. జుట్టు కూడా దువ్వుతుంది. చీరలు లేనప్పుడు ఆ కూతురు చీరలు కూడా కట్టుకుంటుంది. అంత ప్రేమతో యిస్తే యెట్లా నిరాకరిస్తుంది?

కూతురికి పదేళ్లు. ఆమెకి చదువు చెప్పడానికని ఒక బీద ట్రెయినింగు విద్యార్థి, చంద్రశేఖరాన్ని తన యింట్లోనే వుంచుకుని భోజనం పెడుతున్నాడు. అతను సంగీతవిద్యార్థి కూడాను. అందుకని ఆ పిల్లకి, సంగీతం కూడా చెపుతున్నాడు. వెంకట్రామయ్యగారు సుందరమ్మని కూడా పాఠాల దగ్గిర కూచోమన్నారు. తరవాత తరవాత సుందరమ్మకీ యిష్టం కలిగింది.

“ కమలసులోచన......మరాళగామిని - కరిహరమధ్యే...కస్తూరి కుంకమ సంకలితే—”

అని పాడుతో వుంటే, ఆమె చిన్నతనము, దేవీపూజా, సహస్రనామార్చనా, కుంకుమపూజా, హారతులూ, జ్ఞాపకం వొస్తాయి.

“కచభరచర సుమమాలా, కరసరసిజ పరిపాల సూనృత వర శుభగాత్రీ...కళ్యాణీ అని పాడుతో వుంటే శరీరం పులకరించేది. ప్రతిదినమూ తన దగ్గిరిగా కూచుని పాట వింటో, విశాల నిర్మల నేత్రాలను అంతర్ముఖం చేసి, ఆనందం ముఖాన వెలుగుతో వినే ఆమంగళవిగ్రహాన్ని చూసి, ఆ తేజస్సులో కొంత మొదట తన పాటవల్లననీ, తరవాత తనవల్లనే ననీ, మోసపోయ్యే, ఆ యువ్వనుడి విభ్రాంతిని ఆమె గ్రహించనే లేదు.

అనుభవమూ, రసజ్ఞతా లేని, ఆయువకుడు, తన భాధను మింగుకుని, మింగుకుని, ఆమే తనకు ఎదో విస్పంగా తెలియ చేస్తుందని ఆశ పడిపడి, యింటినంతా పువ్వులతో నింపుతున్నట్టు తిరిగి ఆమె శుభశృంగార్ని భరించలేక, యువ్వనులకు సహజంగా తోచే, మార్గాలను వుపయోగించడం ప్రారంభించాడు. మెల్లిగా సంగీత పాఠాలు కూడా స్వరజతుల్ని చేరుకున్నాయి.

“కరివరదా, మరిమరి నాఅధరము గ్రోలగ”

నేర్పుకునే శిష్యురాలి ధ్యాస తాళం మీదా స్వరం మీదా, వినే సుందరమ్మకి ఆవాక్యంలో మొదటి భాగం మీదా, నేర్పే గురువుకి రెండో భాగం మీదా వుండేది ధ్యాస. “నీవు స్మరణాగాక వేరే దారిగాను” అని ఆమె ఒంక చూస్తాడు. ఆమె ఇంకో అర్థంలో ఆమాటలనే తలుచుకుంటో ఎక్కడో చూస్తుంది.

మొదటినించీ పరాధీనుడూ, ఇతరుల దయలో మెలగ వలిసినవాడు కావడం చాత, అతనికి ధైర్యమే నశించింది. తన పాటలతో ఆమె హృదయం మేలుకుని, తనవేపు తిరుగుతుందని అతని ఆశ. కాని ఆమె తనయెడల వాంఛ చూపకపోతే, కలలోనన్నా ఆమెకి తనకోర్కె తెలపలేడు. ఆమె మనసులో ఏమి జరుగుతోందో కనిపెట్టే తెలివిలేదు.

“నిన్న మొదలు నిదుర లేదే చెలి” అన్నా, చివరికి “తోడలు, తోడలు” అని పాడినా లాభంలేక పోయింది. ఆమె కొంచెం సిగ్గుపడడమో, కోపపడడమో చేస్తే కనపడ్డా అతనికి ఆశ వుండును. ఆభావం ఆపిల్లకి ఎంత అర్థమవుతుందో సుందరమ్మకీ అంతే అర్థమవుతోంది. భర్త చితిమీదనే ఆమె శృంగార భవంతూడా తగల పెట్టి వొచ్చినట్టుంది.

కాముకుని వుండగా వుండగా అతని అదృష్టంవల్ల అతనికి చక్కని సమయం లభించింది. అభేద్యమైన దుర్గంలో ఒక్కమూల ప్రవేశమార్గం లభించింది. ఆమె నిర్మల హృదయపద్మంలో అతి మృదువైన దళం ఒకటి కందింది. ఆమె స్వభావంలో వున్న ఒక్క మెత్తని స్థలంమీద తలవని తలంపుగా అతని వేలు పడింది.

అతనికి జ్వరంరావడం కారణం. కష్టాలు కూడా జీవితంలో యిట్లానే వుపకారానికి కారణాలవుతాయి. దూరదృష్టితో చూస్తే చివరికి అపకారమే పర్యవసాన మవుతుందేమో! ఇతరులమీద ఆధారపడే సమాజంలో చంద్రశేఖరం, సుందరమ్మా, సఖులు కావడంచాత సహజంగా పరస్పర సానుభూతి వుంటుంది. అతనికి అప్పుడప్పుడు సుందరమ్మ కాఫీ సుందరూ యిస్తోంది. గిన్నె అందిచ్చేప్పుడన్నా ఆమె వేలు తగులుతుందేమోనని ఆశపడతాడు. కొంచెం సేపు రెండుమాటలు మాట్లాడ కూడదా? ఆమె నిలుచున్న నాలుగు నిమిషాలూ, అతనికి గొప్ప ఐశ్వర్యం వచ్చినట్టుంటుంది. తాగడం ఆలస్యం చేస్తాడు. ఒకనాడు జాస్తిగా పెద్దమూలుగు మూలిగాడు.

“ఏమి?”

మాట్లాడడు.

“నెప్పా?”

మాట్లాడడు.

“నయంలేదా”

“ఎప్పటికీ నయంకాదు.”

“ఎందుకు అట్లా అనుకుంటావు? వుత్త జ్వరానికి?”

“నాకు తెలుసు.”

“తగ్గుతుంది. విచారపడకు.” అని వెళ్లిపోయింది పనిలేకండా పడుకుంటే అదే ఆలోచన. జ్వరంలో కూడా తాపజ్వరం విడవలేదు. ఎన్నోప్లానులు వేసు

...ంటాడు. ఆమె గాగాకే భయం వేస్తుంది. మళ్లీ ఆమె సాధారణ తేజం చూస్తేనే విభ్రమం కలుగుతుంది. ...మని చూస్తూ చెయ్యాలనుకున్నవన్నీ మరిచిపోయి, ...జడి వ్యాకులపడుతుంటాడు. ఒకసారి ఆమెని చూడ ...అతని ఆలోచన ...ండానే కళ్లనీళ్లు కారాయి. ఆమె జాలిపడ్డది.

"మీవాళ్లెవరూ లేరా?"

"...రు. వాళ్లకి నేనక్కర్లేదు."

"...మని చెప్పనా?"

"వొద్దు"

"మరి దిగులుపడతా వెందుకు?

అని వెళ్లిపోయింది.

కోపమొచ్చింది అతనికి. సాధారణమైన జాలికూడా లేదే ఆమనిషికి! కాని కొంచెం జాలిచూపితే దాన్ని 'ఎడ్వాంటేజి' తీసుకుని, దాన్ని ప్రేమగా భావించి పీడించిన పూర్వపురుషుల దౌర్జన్యంనించి బాధపడ్డ స్త్రీలరక్తం ఆమెలో ప్రవేశించి సహజమగ్ధత్వాన్ని ప్రసాగించలేదా మరి? (సశేషము)

# మదరాసు దక్షిణ మహారాష్ట్ర రైలుమార్గమున

క్రిస్టమస్, క్రీస్తుసంవత్సరాది సెలవులలో 1, 2, 3-వ తరగతి ప్రయాణీకులకు

# ప్రత్యేక తగ్గింపు ధరలు

గతసంవత్సర క్రిస్‌మస్ క్రీస్తుసంవత్సరాది శెలవులలో ఎం. ఎస్. ఎమ్. రైల్వేవారు ప్రయాణీకుల సౌకర్యము కొరకొక క్రొత్తమార్గమును కనిపెట్టిరి. యీసంవత్సర ఈస్టర్ శెలవులలో యింకనూ యెక్కువగా అనుకూలించు "ఇచ్ఛాపూర్వక ప్రయాణము" చేయగల సీసన్ టిక్కెట్లను యివ్వగలిగిరి.

రాగల క్రిస్‌మస్, క్రీస్తుసంవత్సరాది శెలవులకు పైజెప్పిన రెండు విధముల టిక్కెట్లును యివ్వబడును. ఇందులో 1, 2; 3-వ తరగతి "ఇచ్ఛాపూర్వక ప్రయాణ" టిక్కెట్లను కొన్న వారు యే నిర్బంధమునూ లేక ఎం. ఎస్. ఎమ్. రైల్వే యందంతటను, 3-వ తరగతి ప్రత్యేకమండల ప్రయాణటిక్కెట్లను పొందినవారు ఆ మండలమున మాత్రము, యెన్నిసార్లయినను, ప్రయాణము చేయవచ్చును. ఈ రెండువిధముల టిక్కెట్లును 1935-వ సం॥ డిసెంబరు 13-వ తేది మొదలు 1936-వ సం॥ జనవరి 14-వ తేదివరకు అమ్మబడును. డిసెంబరు 13-వ తేది మొదలు 31-వ తేది లోపల టిక్కెట్లను, కొనినవారు కొన్న తేది మొదలు 15 దినములవరకు ప్రయాణము చేయవచ్చును. 1936-వ సం॥ జనవరి 1-వ తేది మొదలు, కొన్నటిక్కెట్ల వుపయోగము 1936-వ సం॥ జనవరి 14-వ తేది మధ్యరాత్రితో నంతరించును.

ఈ టిక్కెట్లనుకొన్న ప్రయాణికుల ఎం. ఎస్. ఎమ్. రైల్వేలైనులో ప్రయాణికుల కొనిపోవు (ప్యాసెంజరు) బండ్లలో దేనియందైన సంచరింపవచ్చును. ఆమండలమున యే స్టేషనులోనైన ఆగవచ్చును. ఈ టిక్కెట్టుకుగల కాలపరిమితిలోపుగ యెన్నిదినములైన యచ్చట నుండవచ్చును.